# 3

# క్రీస్తు: మనుష్యకుమారుడు

పిలాతు, యేసును ప్రశ్నలడిగిన తరువాత, “ఇదిగో, ఈ మనుష్యుడు!” అని పలికాడు. మనము, కూడ, మనుష్యుడైన క్రీస్తు యేసును వీక్షించవలసియున్నది. యేసు క్రీస్తు, మనుష్యకుమారుడుని గూర్చి మనలను మనము ఈ మూడు ప్రశ్నలడుగుకొనవలెను: యేసు క్రీస్తు నిజముగా ఒక మానవుడైయుండెనా; అనగా, ఆయన అదే సమయంలో దేవుని దైవికమైన కుమారుడు మరియు ఒక మానవుడును అయియుండెనా? ఆయన ఒక మానవుడై యుండినట్లయితే, ఆయన ఎటువంటి మానవుడై యుండెను? ఆయన మానవత్వము మనలో కలిగించుచున్న వ్యత్యాసమేమై యున్నది?

## యేసు క్రీస్తు ఒక మానవుడై యుండెనా?

**లేఖనముల సాక్ష్యములు**

యేసు దైవమై యుండినప్పటికిని, ఆయన నిజముగా ఒక మానవుడై యుండెను, ఒక నిజమైన మానవుడై యుండెనని, బైబిలు బోధించుచున్నది. యేసు మానవత్వమునకు సంబధించిన ఈ క్రింది లేఖనాధార ఋజువులను పరిగణించి చూడండి:

యేసు జీవిత కథను రచించుచుండిన యోహాను “ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను” అని చెప్పుచూ తన రచనను మొదలుపెట్టాడు (యోహాను 1:1). ఆ తరువాత “ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా, మన మధ్య నివసించెను, తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె, మనము ఆయన మహిమను కనుగొంటిమి” అని చేర్చాడు (యోహాను 1:14).

పౌలు ఇలా సాక్ష్యమిచ్చుచున్నాడు, ఆయన పుట్టక మునుపే, యేసు క్రీస్తు “దేవుని స్వరూపము కలిగినవాడైయుండెను” కానీ “దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు.” కాబట్టి, “ఆయన మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరుంచుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను” (ఫిలిప్పీయులకు 2:6, 7).

“అయితే కాలము సంపూర్ణమైనప్పుడు, దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను” అని (గలతీయులకు 4:4, 5)లో వ్రాయబడియున్నది. సహజంగానే, ఆ కుమారుడు యేసు అయియుండెను.

హెబ్రీ పత్రిక రచయిత ఇలా చెప్పుచున్నాడు,

> పరిశుద్ధ పరచువారికిని (అనగా, యేసు) పరిశుద్ధపరచబడువారికిని (అనగా, మానవులు) అందరికి ఒక్కడే మూలము, ఈ హేతువు చేతను వారిని సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడలేదు,
>
> ... కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున, ... ఆయన కూడ

> రక్తమాంసములలో పాలివాడాయెను. కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై, దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమునుగల ప్రధానయాజకుడగు నిమిత్తము, అన్ని విషయములలో ఆయన సహోదరులవంటివాడు కావలసివచ్చెను (హెబ్రీయులకు 2:11-17).

పౌలు ఇలా వ్రాస్తున్నాడు, “దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన క్రీస్తుయేసను నరుడు” (1 తిమోతికి 2:5).

ఈ ఋజువంతా యేసు దేవుని కుమారుడు మాత్రమే అయి యుండలేదు కానీ మనుష్య కుమారుడునై యుండెనను వాస్తవమును సూచించుచున్నది. వాస్తవానికి, యేసు క్రీస్తు “మనుష్యకుమారుడు” అని మనము ఆయన గూర్చి చెప్పుకొనునప్పుడు, మనము యేసుకు ప్రీతికరమైన ఆయన హోదాను ఉపయోగించుచున్నాము. ఆయన తన్నుతాను “మనుష్యకుమారుడు” అని సువార్తలలో 80సార్ల కంటె ఎక్కువగా సూచించుకొన్నాడు.

## యేసు జీవితమిచ్చుచున్న సాక్ష్యము

క్రొత్త నిబంధన గ్రంథకర్తలు యేసు ఒక మానవుడై యుండెనని రూఢిపర్చుట మాత్రమే కాదు, గాని ఆయన జీవితము బయలుపర్చుచున్న విషయముల ద్వారా ఆయన మానవత్వము గూర్చి కూడ సువార్తలు సాక్ష్యమిచ్చుచున్నవి, మనము అనుభవించుచున్న అవే విషయములను యేసు కూడ అనుభవించాడు. ప్రతి ఒక్కరి వలెనే, ఆయన “స్త్రీయందు పుట్టెను” (గలతీయులకు 4:4, 5; లూకా 2 చూడుము). ఒక పిల్లవాడుగా, ఆయన తన తల్లిదండ్రులకు లోబడియుండెను (లూకా 2:51). ఆయన పెరిగి పెద్దవాడగుచుండినప్పుడు, ఆయన “యేసు జ్ఞానమందును, వయస్సు నందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను” (లూకా 2:52).

యేసు ఒక వృత్తిని నేర్చుకొని దానిని అభ్యసించాడు: తన (ఇహలోక) తండ్రి యోసేపు వలెనే, ఆయన ఒక వడ్రంగియై యుండెను (మార్కు 6:3). ఆయన అలసటచెందాడు, గనుక సేదదీర్చుకొన్నాడు (యోహాను 4:6); ఆయన ఆకలిగొన్నప్పుడు భోజనము చేసాడు, దాహముగొన్నప్పుడు నీళ్లు త్రాగాడు (మత్తయి 4:2; యోహాను 19:28).

యేసుకు ప్రత్యేక స్నేహితులు కూడా ఉండిరి. వారిలో మరియ, మార్త, మరియు లాజరున్నారు. లాజరు రోగియైనప్పుడు, “ప్రభువా, యిదిగో నీవు ప్రేమించువాడు రోగియై యున్నాడు” అని అతని సహోదరీలు యేసుకు వర్తమానము పంపించారు (యోహాను 11:3, 5). యోహాను, “యేసు ప్రేమించిన శిష్యుడు” అని తనను గూర్చి తాను చెప్పుకొనుచున్నాడు (యోహాను 21:20; యోహాను 13:23; 19:26 కూడ చూడుము).

ఆయనకు ఒక కుటుంబముండినది. యేసు నివసించుచుండిన నజరేతు నగరవాసులు ఆయన గూర్చి ఇలా చెప్పుకొన్నారు: “ఇతడు మరియ కుమారుడు కాడా? ఇతడు యాకోబు, యోసే, యూదా, సీమోను అనువారి సహోదరుడగు వడ్లవాడు కాడా? ఇతని అక్కచెల్లెండ్రందరు మనతోనున్నవారు కారా?” (మార్కు 6:3).

మానవుడై యుండిన యేసు, శోధనలకు గురయ్యాడు (మత్తయి 4:1-11; హెబ్రీయులకు 2:18). ఆయన కోపగించుకొన్నాడు (మార్కు 3:5). ఆయన దుఃఖమును సహితము అనుభవించాడు, ఆయన ఏడ్చాడు (యోహాను 11:35).

అప్పుడప్పుడు, ఆయన శ్రమనొందాడు (1 పేతురు 4:1). ఇతరులందరివలెనే, ఆయన మరణించాడు (మత్తయి 27:50).

ఒకే ఒక రీతిలో, యేసు ఇతరులందరి కంటె భిన్నమైనవాడుగా జీవించాడు: "సమస్త విషయములలోను మనవలెనే" శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను (హెబ్రీయులకు 4:15).

## యేసు ఎటువంటి మానవుడై యుండెను?

యేసు నిస్సంశయముగా ఒక మానవుడై యుండెను; ఆయన నిజముగా మానవుడై యుండెను. ఆయన ఎటువంటి మానవుడై యుండెను? ఒకసారి కొందరు గ్రీసుదేశస్థులు ఫిలిప్పు నొద్దకు వచ్చి, "అయ్యా, మేము యేసును చూడగోరుచున్నాము" అని అతనితో చెప్పారు (యోహాను 12:21). నేటి ప్రజలు సహితము ఈ నాడు యేసును చూడగోరుచున్నారు. వారు లేఖనములను అధ్యయనము చేయుట ద్వారా, యేసును చూచినప్పుడు, వారేం చూస్తారు? యేసు పలికిన పలుకులు మరియు చేసిన కార్యములు ఆయన ఎటువంటివాడై యుండెనో బయలుపర్చును.

దేవాలయములో వ్యాపారము చేయుచుండిన వారిని ఆయన "కొరడాలతో" వెలుపలికి వెళ్లగొట్టాడు (యోహాను 2:13-17). దీనికి అదనంగా, ఆయన ఒక వడ్రంగి వలె కష్టపడి పనిచేసాడు. ఆయన దూర ప్రయాణాలు చేయుచు భారభరితమైన జీవితమును జీవించాడు (మత్తయి 8:20 చూడుము). మరణించక మునుపు, ఊహింపశక్యము కాని చిత్రహింసను ఆయన సహించాడు. *ఆయన బలముగలవాడై యుండెను.*

ఆయన రోగులను స్వస్థపర్చాడు మరియు ఆకలిగొన్నవారికి ఆహారం పెట్టాడు. *ఆయన జాలిగుండెలు గల జగమునేలువాడై యుండెను.*

ఆయన సుంకరులతోను పాపులతోను సత్సంబంధములు కలిగియుండెను (లూకా 15:1, 2) మరియు వ్యభిచారములో పట్టబడిన స్త్రీని క్షమించాడు (యోహాను 8:1-11). ఆయన క్షమించిన మరొక పాపపు స్త్రీ అర్పించిన శ్రద్ధాంజలిని సహితము ఆయన అంగీకరించాడు (లూకా 7:36-50). *ఆయన ప్రేమామయుడై యుండెను.*

కొందరాయన యొద్దకు తమ చిన్నపిల్లలను తీసికొనివచ్చినప్పుడు ఆయన వారినాశీర్వదించాడు (మార్కు 10:13-16). *ఆయన మృదువైన మనిషై యుండెను.*

సాధ్యమైనంత తీక్షణమైన మాటలను ఉపయోగించుచు ఆయన పరిసయ్యులను గద్దించాడు (మత్తయి 23:13-33). సందర్భం పిలుపునిచ్చినప్పుడు, *ఆయన ఆగ్రహముచెందినవాడయ్యాడు.*

ఆయన చిక్కు ప్రశ్నలడుగుచు తన శత్రువులను గంధరగోళ పరిస్థితిలోనికి నెట్టివేసాడు (మత్తయి 22:46). *ఆయన ప్రజ్ఞావంతుడును చతురుడునై యుండెను.*

ఆయన లాజరు యొక్క స్నేహితులతోను కుటుంబ సభ్యులతోను ఏడ్చాడు (యోహాను 11:35). *ఆయన సానుభూతి మరియు తదనుభూతిగలవాడునై యుండెను.*

ఆయన తన శిష్యుల పాదములు కడిగాడు (యోహాను 13:3-11). *ఆయన వినయముగలవాడై యుండెను.*

ఆయనను సిలువవేయవలెనని తీసికొనివెళ్లుటకు జనసమూహము దొమ్మిగా కూడి

వచ్చినప్పుడు, "నేనే ఆయనననని" వారితో చెప్పగా "వారు వెనుకకు తగ్గి నేలమీద పడిరి" (యోహాను 18:5, 6). *ఆయన అధికారముతో కూడిన గంభీరమైన సమయస్ఫూర్తిగలవాడై యుండెను.*

"తండ్రీ, నీ చిత్తమైతే తొలగించుము, అయినను నా యిష్టముకాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక" అని ఆయన గెత్సేమనే తోటలో ప్రార్థించుచుండినప్పుడు ఆయన దేవుని చిత్తమునకు తనను తాను అప్పగించుకొన్నాడు (లూకా 22:42). "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను" అని హెబ్రీయులకు 5:8, 9 చెప్పుచున్నది (ఫిలిప్పీయులకు 2:8 కూడ చూడుము). *ఆయన విధేయతగలవాడును, లోబడుచుండినవాడునై యుండెను.*

దేవుని రాజ్యములో ఎవరు గొప్పవారో యని శిష్యులు తమలో తాము వాదించుకొన్నప్పుడు, "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు, గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను" అని చెప్పుచు యేసు తన ప్రతిస్పందనను కనుపరిచాడు (మార్కు 10:45). ఆయన జీవితం ఆషామాషీగా ఆడుకొందాము పాడుకొందామన్న ధోరణిగలది కాదు. కానీ – అది ఆయనకు అనుకూలంగా లేకుండినప్పుడు సహితము, ఆయన అలసిపోయియున్నప్పుడు కూడ, ఆయన చేయవలెనని ఆశించిన ఇతర పనులుండినప్పటికిని – ఇతరులకు ఉచారము చేయుట మరియు వారికి సహాయపడుటయై యుండినది. *ఆయన పరులకు ఉపచారము ఒనర్చుటకే జీవించినవాడై యుండెను.*

సిలువ మీద, ఆయన తనను గూర్చి తాను ఆలోచించుకొనుటకు బదులుగా, ఆయన మనస్సంతా ఇతరులుపైనే కేంద్రీకరింపబడి యుండినది. గనుకనే ఆయన, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు" అని తన ప్రక్క మరొక సిలువ మీద ఉండిన దొంగతో చెప్పాడు (లూకా 23:43). యోహాను గూర్చి, తన తల్లితో, "అమ్మా, యిదిగో నీ కుమారుడు!" అనియు తన తల్లి గూర్చి, యోహానుతో "యిదిగో నీ తల్లి" అనియు చెప్పాడు (యోహాను 19:26, 27). ఆయనను మేకులతో సిలువకు దిగగొట్టినవారిని సూచిస్తూ, "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించుము" అని పలికాడు (లూకా 23:34). *ఆయన ఆలోచనాపూర్ణుడును నిస్వార్థపరుడునై యుండెను.*

ఆయన మానవాళి పాపముల కొరకు సిలువ మీద మరణించుట ద్వారా తన ఉద్దేశమును నెరవేర్చాడు, గనుకనే ఆయన, "సమాప్తమైనది!" అని పలికాడు (యోహాను 19:30). *ఆయన సాధించాలని ఈ లోకమునకు వచ్చిన సదుద్దేశపూర్వక సంకల్పమును సాధించిన విజయీభవుడై యుండెను.*

పేతురు ఆయనను ఎరుగనని బొంకిన తరువాత, ఆయన పేతురును మరలా తన సమక్షములోనికి చేరదీసాడు (యోహాను 21:15–19). *ఆయన క్షమించువాడై యుండెను.*

తన తండ్రి చిత్తమును నెరవేర్చుటయే ఆయనకు "ఆహారమైయుండినదని" చెప్పాడు (యోహాను 4:34; యోహాను 6:38 కూడ చూడుము). ప్రతి విషయములోను ఆయన దేవుని చిత్తమునే నెవేర్చాడు. ఆయన సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను (హెబ్రీయులకు 4:15). ఆయన శత్రువులు సహితము ఆయనలో ఏ తప్పిదమును కనుగొనలేకపోయారు. ఆయన బలవంతుడును పురుషోచిత పురుషుడునై

యుంటూనే, "(ఇప్పుడు పెద్దవారైన) చిన్న నాటి స్నేహితుల" తో కలిసి మద్యము సేవించు శాలకు వెళ్లి, ఒకటి రెండు పెగ్గులు సేవించి, ఏవేవో మురికి హాస్యోక్తులు చెప్పుకొంటూ, నవ్వుకొంటూ, చేయుటకు అంతకు మించిన మంచి కార్యం మరొకటి లేనందుకు ఆదివారం రాగానే మళ్లీ మామూలుగానే ఆలయానికి వెళ్లుచుండు వానివలె ఉండలేదు. *ఆయన, మరో మాటలో చెప్పుకొంటే, నీతిమంతుడై యుండెను.*

కాబట్టి మనము యేసును చూచినప్పుడు, ఏమి చూస్తున్నాము? ఇతర విషయాలతో పాటు, మనము బలమైనవాడును, నీమంతుడును, జాలిగుండెలుగలవాడును, నిస్వార్థపరుడును, ప్రేమామయుడునైన వానిని చూస్తున్నాము. యేసు ఎటువంటివాడై యుండెనోయను విషయమై ప్రజలు తరుచుగా తప్పుడు అభిప్రాయములు కలిగియుంటారు. గనుక సువార్తలలో ఆయనకు ఆపాదింపబడిన సమస్త గుణగణాలు ఆయనలో ఉన్నవని మనము గ్రహించునట్లు రూఢిపర్చుకొందాము.

## ఆయన మానవత్వము వలన మనలో ఏదైనా విశేషలక్షణం ఏర్పడేనా?

### మనము ఆయనను ప్రేమించవలెను

యేసు ఎటువంటివాడై యున్నాడో అని తెలిసిన సత్యం మనము ఆయనను ప్రేమించునట్లు మనలను పురికొల్పవలెను. ఈ సత్యమును ఎమ్ నోర్వెల్‌యంగ్, "I Love Him, Don't You?" ("నేనాయనను ప్రేమించుచున్నాను, నీవు కూడ ప్రేమించవా?") అను శీర్షికన ఆయన రచించిన పద్యకావ్యంలో బహు చక్కగా వర్ణించాడు.

> ఎంతో మానవీయమైనవాడై యుండి తన శిష్యులకు చనవు పేరు పెట్టినవాడు,
> మాటిమాటికి మారిపోవుచుండిన సీమోనులో రాయి వంటి స్థిరత్వమును చూచినవాడు,
> నేనాయనను ప్రేమించుదును.
>
> జనసమూహములపై జాలి చూపినవాడు, అద్భుతకరమైన ఆహారమును వారు ప్రశాంతంగా ఆరగించుటకు వారిని
> పచ్చని గడ్డిపై పంక్తులుగా కూర్చుండబెట్టినవాడు, నేనాయనను ప్రేమించుదును.

ఈ పద్యకావ్యము యేసునకు గల గ్రహింపు మరియు జాలి గల కన్నీరు, నీతిమంతమైన రోషము, మరియు వినయముగల మనస్సు గూర్చి చెప్పుచున్నది. అది ఈ క్రింది మాటలతో ముగియుచు, భయమును మరియు బాధను జయించిన క్షమాగుణంగల క్రీస్తును గుర్తుచేయుచున్నది:

> దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడైయున్న జయశాలియైన రాజును,
> ఆయన మహిమలోనికి రమ్మను ఆహ్వానమును
> నీకును నాకును ఇచ్చువానిని నేను ప్రేమించుదును.
>
> నేనాయనను ప్రేమించుదును, నీవును ప్రేమించవా?[1]

### మనము ఆయన వలె ఉండుటకు ఆశించవలెను

యేసు శిష్యులు వలె ఉండవలెనని ఆశిస్తారు. మనము, క్రైస్తవులముగా మన యజమానుని

అనుకరించవలెనని బైబిలు బోధించుచున్నది. పేతురు ఇలా వ్రాయుచున్నాడు, "ఇందుకు మీరు పిలువబడితిరి, క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1 పేతురు 2:20సి, 21). "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీయులకు 11:1).

**ఆయన మనలను అర్థంచేసికొంటాడని మనము గుర్తించవలెను**

యేసు ఒక మానవుడై యుండి మానవులు అనుభవించు సమస్తమును అనుభవించాడను వాస్తవము ఆయన మన సమస్యలను అర్థంచేసికొంటాడని మనము హర్షించునట్లు మనలను ప్రేరేపించవలెను. ఈ విషయాన్ని హెబ్రీ పత్రిక రచయిత ఇలా వ్రాయుచున్నాడు:

> ఆకాశమండలనుగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహాభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మన వలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదుము (హెబ్రీయులకు 4:14-16).

యేసు "సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడెను," గనుక ఆయన మన బలహీనతలయందు మనకు తన, సహానుభూతిని తెల్పుచూ, సహాయము చేయగలడు!

యేసు మనకు ఎంత సమీపంగా ఉన్నాడను అనుభూతి మనకు కలుగాలి? మనము ఆయనకు ఎంత సమీపంగా ఉన్నామను అనుభూతి ఆయనకు కలుగాలి? ఆయన మనలను అర్థంచేసికొనుననునది హెబ్రీయులకు 4:15 మనకిచ్చుచున్న గొప్ప సందేశమై యున్నది!

నీవు నీ కర్తవ్యమునకును నీకు గల కాంక్షకును నడుమ నలిగిపోయిన అనుభూతి నీవు ఎప్పుడైనా అనుభవించావా? అటువంటి అనుభూతి యేసు గెత్సేమనే తోటలో అనుభవించాడు. నీవెప్పుడైనా శత్రువులను ఎదుర్కొన్నావా? నీవు నమ్ముకొన్న నీ స్నేహితులు ఎప్పుడైనా నీకు నిరాశ కలిగించారా, నిన్ను ఒంటరివానినిజేసి వెళ్లిపోయారా, లేక నీకు ద్రోహం చేసారా? నీవు తృప్తిచెందుటకు ఏపనైనా చేయుటకు సిద్ధపడునంతగా నీవెప్పుడైనా ఆకలిగొన్నావా మరియు నీకు దాహమయ్యిందా? నీవు శ్రమనొంది అలసిపోయావా? నీకెప్పుడైనా ఆశాభంగం కలిగిందా, ఒంటరివాడవయ్యావా, లేక అనాథగా చూడబడితివా? నీవు కొన్ని పర్యాయములు అపవాది చేత శోధింపబడితివా? ఈ అనుభవాలలో యేసునుకు అనుభవపూర్వకంగా తెలియనిదంటూ ఏదియును లేదు.

ఇవన్నీగాక, యేసు ఒక వడ్రంగియై యుండెను. ఒక వృత్తిలో ధ్యేయాన్ని విడువక కొనసాగించుటలో ఎదురగు సవాళ్లు ఆయనకు సుపరిచితమే. వారి అసంతృప్తిని వెల్లడించుచుండు వాడకందారులతో నీవు వ్యవహరించాల్సి వస్తున్నదా? నీ పనులను సరిగా చేయించుకొనుటలో, లెక్క చీటీలోని సొమ్మును నీవు చెల్లించుటలో, లేక ఖాతాదారులు నీకు చెల్లించుటలో, లేక ఖాతాదారులు నీకు చెల్లించవలసియున్న సొమ్ము రాబట్టుకొనుటలో నీకు కష్టాలు ఎదురౌతున్నాయా? యేసు ఇదే విధమైన అనుభవములను అనుభవించాడు!

మనము సహించినదేదైనను, యేసు అర్థంచేసికొంటాడు మరియు మనకు తన

సహానుభూతిని తెలియజేస్తాడు. మనకు గాయమైనప్పుడు, మనతో కూడా ఆయన మన బాధననుభవిస్తాడు. మన రక్షకుడు ప్రేమామయుడైన స్నేహితుడు మరియు సహానుభూతిని తెలియజేయు ఉత్తరవాదియునైయున్నాడను వాస్తవమునుబట్టి మనము ఎంతో ఊరట చెందగలము!

**మనము ఆయనను వెంబడించుటకు ఆశించవలెను**

మనము యేసును ప్రేమించుచున్నవారమైతే, ఆయన శిష్యులమగుటకు మనము ప్రోత్సాహింపబడుదుము. ప్రజలు ఎల్లప్పుడు ఒక హేతువు కొరకును ఒక నాయకుని కొరకును వెదకుచున్నారు. మనకు నాయకుడై యుండుటకు యేసు క్రీస్తు కంటె ఎక్కువ యోగ్యుడైన మరెవరైనా ఉన్నారా? యేసు కలిగియున్న గుణగణాలను కలిగియున్న ఒకరిని మనము తక్షణమే వెంబడించవచ్చును: ఆయన బలవంతుడై యుండినప్పటికిని, మృదువైనవాడై యుండెను; స్థిరముగా దిట్టమైనవాడైనప్పటికిని, జాలిగుండెలు గలవాడై యుండెను; అధికారముగలవాడైనప్పటికిని, విధేయుడై యుండెను; విజయాభవుడైనప్పటికిని, వినయమనస్కుడై యుండెను. మన ప్రభువు సంపూర్ణంగా నిస్వార్థపరుడును, అశేషముగా క్షమించువాడును, మొత్తంమీద ప్రేమామయుడును నీతిమంతుడునై యుండెను. ఆయన ఎవరై యుండినదీ, ఎటువంటివాడై యుండినదీ ఎరిగిన తరువాత, "నా వెంబడి రండి" అని చెప్పుచూ ఆయన జారీచేసిన సవాలును అంగీకరించుటకు మనము ఆనందించుచున్నవారమై యుండవలెను (మత్తయి 4:19).

**ముగింపు**

ఆయన పాపములేనివాడు అంతే, మన వలెనే, యేసు ఒక మానవుడై యుండెను. మనము ఎలా జీవించాలో, ఎలా ప్రేమించాలో, మరియు దేవునిని మరియు మన తోటివారిని ఎలా సేవించాలో ఆయన మనకు ఉపదేశించాడు. విధేయత గూర్చి యేసు చూపిన మాదిరిని మనము అనుకరించవలెను. "నా యిష్ట ప్రకారము కాదు, నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అని ఆయన ప్రార్థించాడు. నీ సొంత చిత్తమును ఉపేక్షించి నిన్ను నీవు దేవుని చిత్తమునకు అప్పగించుకొనుము. నీవు రక్షింపబడవలెనని దేవుడు కోరుచున్నాడు, గనుక నీవు పాపక్షమాపణ పొందుకొనునట్లు నీవు లోబడవలసిన ఆజ్ఞలు ఆయన నీకిచ్చాడు. ఆయన ఆజ్ఞలకు లోబడుము, అప్పుడు నీవు క్షమింపబడుదువు. ప్రేమామయుడును, జాలిగుండెలుగలవాడునైన యేసు నీ శేష జీవితాంతము వరకు నీకు సహానుభూతి చూపించువాడును, నిన్ను అర్థంచేసికొనువాడైన స్నేహితుడు మరియు ఉత్తరవాదియై యుండును.

---

సూచన

[1]M. Norvel Young, "I Love Him, Don't You?" *20th Century Christian* 41 (October 1978): 21.